ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



పెద్దపల్లి
జిల్లా వార్తలు
3★
సోమవారం 11 మార్చి 2024

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి 6లో..

6లో.. బీఆర్ఎస్ హయాంలో సింగరేణిలో దోపిడీ

జిల్లాకు ఖేలో ఇండియా సెంటర్





శిక్షణ పొందుతున్న బాలికలు , ఖేలో ఇండియా సెంటర్ స్థలాన్ని పరిశీలిస్తున్న క్రీడాశాఖ అధికారులు(ఫైల్)

- సుల్తానాబాద్‌లో ఖోఖో శిక్షణ కేంద్రం ఏర్పాటు
- ఐదేళ్ల పాటు శిక్షణ, క్రీడా పరికరాల మంజూరు

సుల్తానాబాద్, మార్చి 10: సుల్తానాబాద్‌కు ఖేలో ఇండియా కార్యక్రమం ద్వారా ఖోఖో శిక్షణ కేంద్రం మంజూరైంది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని స్పోర్ట్స్ అథారిటీ ఇండియా వారు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు రెండు సెంటర్లు మంజూరు చేయగా సుల్తానాబాద్ ఒకటి కావడం విశేషం. సుల్తానాబాద్ పట్టణం క్రీడలకు, క్రీడాకారులకు నిలయంగా మారి ఇక్కడ అనేక రాష్ట్ర జాతీయస్థాయి క్రీడా పోటీలను నిర్వహించిన చరిత్ర ఉంది. క్రీడల్లో రాణించిన వారు ఎందరో క్రీడారంగం కోటాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు పొందారు. ఈ నేపథ్యంలో సుల్తానాబాద్‌కు మంజూరైన ఖోఖో శిక్షణ కేంద్రాన్ని సుల్తానాబాద్ పట్టణంలోని పెరికెగిద్ద ఆంజనేయ స్వామి ఆలయానికి ఎదురుగాఉన్న తెలంగాణ క్రీడా ప్రాంగణంలో శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే సుల్తానాబాద్ ఖోఖో క్రీడలకు కేరాఫ్ అడ్రస్ ఉంది. దాంతో ఖోఖో క్రీడల్లో ఖేలో ఇండియా సెంటర్ మంజూరు కావడంపై ఈ ప్రాంత క్రీడాకారులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 75మంది క్రీడాకారులు జాతీయ పోటీల్లో పాల్గొన్న వారే. బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారు. కాగా మంజూరైన ఖోఖో శిక్షణ కేంద్రంలో పది రోజుల నుంచి ప్రతీ రోజు 30 మంది బాలురకు, 30 మంది బాలికలకు శిక్షణ ఇస్తున్నారు. ఈ సెంటర్ ఐదేళ్ల పాటు కొనసాగుతుందని ఉదయం అల్పాహారం, సాయంత్రం భోజనం అందిస్తామని క్రీడాశాఖ అధికారులు తెలిపారు.

గ్రామీణ క్రీడాకారులకు అవకాశాలు

- సురేష్, జిల్లా క్రీడల యువజన శాఖ అధికారి



సుల్తానాబాద్‌కు ఖేలో ఇండియాలో మంజూరైన క్రీడల శిక్షణ కేంద్రం ద్వారా గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు లభిస్తాయి. అత్యంత నైపుణ్యంతో ఈ శిక్షణ కొనసాగుతుంది. మంచి క్రీడాకారులుగా రాణిస్తారు. క్రీడల్లో ఇండియాను అగ్రస్థానంలో నిలిపేందుకు కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా ఖేలో ఇండియా సెంటర్లను ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రతీజిల్లాకు ఒక సెంటర్‌ను మంజూరు చేసింది. పెద్దపల్లి జిల్లాకు మంజూరైన సెంటర్‌ను సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేశారు. అంతర్జాతీయస్థాయి ఖోఖో క్రీడాకారుడు గెల్లు మధుకర్‌ను కోచ్‌గా నియమించి శిక్షణ ఇస్తున్నాము.

ప్రతీ రోజు 50 నుంచి 70 మందికి శిక్షణ

- గెల్లు మధుకర్, ఖోఖో కోచ్



సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేసిన ఖేలో ఇండియా సెంటర్‌లో ప్రతీ రోజు 50 నుంచి 70 మంది బాలబాలికలకు ఖోఖోలో శిక్షణ ఇస్తున్నాం. నేను ఖోఖో అంతర్జాతీయ స్థాయి పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించా. ఆరవైకి పైగా జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. సెంటర్ ఏర్పాటుతో ఖోఖో క్రీడకు పూర్వ వైభవం చేకూరినట్లయింది. శిక్షణ పొందుతున్న బాలబాలికలకు త్వరలోనే ఉచిత భోజన వసతి సౌకర్యం ఉంటుంది. ఢిల్లీ నుంచి క్రీడాశాఖ అధికారులు ఇక్కడకు వచ్చి సెంటర్‌ను పరిశీలించి వెళ్లిన తర్వాత అన్ని సౌకర్యాలు కల్పిస్తారు.

అట్టడుగువర్గాల ఆశాజ్యోతి బుర్ర కొండయ్య



కొండయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం

ఎలిగేడు, మార్చి 10: అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి, అందరికీ ఆదర్శప్రాయుడు బుర్ర కొండయ్య అని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. బుర్ర కొండయ్య ఇటీవల మృతి చెందగా ఆదివారం సాయంత్రం ఎలిగేడులో ఆయన కుటుంబసభ్యులను మంత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న అసమానతలు, వివక్షపై సీపీఐ ద్వారా ఆయన అనేక ఉద్యమాలు చేశారన్నారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రతీ గ్రామంలో ఆయన పోరాట పటిమను ఇప్పటికీ ప్రజలు గుర్తు చేసుకుంటారని తెలిపారు. బుర్ర కొండయ్య ఆశలు, ఆశయాలు ప్రజల్లో సజీవంగా ఉంటాయన్నారు. మంత్రి వెంట రాజేశంగౌడ్, సత్యనారాయణగౌడ్, అంతటి అన్నయ్యగౌడ్, సారయ్యగౌడ్, కొండ తిరుపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

17నుంచి ముర్మూర్ కొమురన్న జాతర



మాట్లాడుతున్న గోపు ఐలయ్యయాదవ్

అంతర్గాం, మార్చి 10: అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ శివారు బ్రాహ్మణపల్లి పంప్‌హౌస్ వద్ద ఈ నెల 17 నుంచి శ్రీ ముర్మూర్ కొమురన్న జాతరను నిర్వహించనున్నట్లు జాతర కమిటీ చైర్మన్ గోపు ఐలయ్యయాదవ్ తెలిపారు. జాతర మొదటి రోజు 17న ఆదివారం దృష్టి కుంభం, పైలలు తీయుట, రుద్రాభిషేకం, సుంకు పెద్దపట్నం వేయడంతో పాటు వాక్సిద్ధి శ్రీ మేడలాదేవి సహిత శ్రీ మల్లికార్జున స్వామి కళ్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 18న సోమవారం భక్తుల అగ్నిగుండం ప్రవేశంతో పాటు ఒగ్గు కళా బృందంచే ఒగ్గు కథ ప్రదర్శించనున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యం కొరకు జాతర ప్రదేశంలో చలువ పందిళ్ల ఏర్పాటు, తాగునీటి వసతి, వీధి దీపాల ఏర్పాటు చేయడంతో పాటు అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. గోదావరి బస్టాండ్ నుంచి జాతర వరకు బస్సులు నడపనున్నట్లు, భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి శ్రీ మల్లికార్జున స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని గోపు ఐలయ్యయాదవ్ కోరారు.

భీమ్ జ్యోతి ర్యాలీకి ఆహ్వానం

పెద్దపల్లిటౌన్, మార్చి 10: ఈ నెల 15న కాన్షిరామ్ జయంతిని పురస్కరించుకొని పెద్దపల్లి జిల్లా కేంద్రంలో మాదిగశక్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భీమ్ జ్యోతి ర్యాలీకి తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ గజ్జెల కాంతంను హైదరాబాద్‌లో కలిసి ఆహ్వాన పత్రికను ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి సురేందర్(సన్ని) ఆదివారం అందించారు. పెద్దపల్లి, వరంగల్ పార్లమెంటు స్థానాల్లో ఏదో ఒక స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ మాదిగలకే కేటాయించాలనే ప్రధాన డిమాండుతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదిగలు ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని అందుకోసమే రాజ్యంలో మాదిగలకు న్యాయంగా రావాల్సిన రాజకీయ వాటా కోసమే మాదిగ శక్తిని ఏర్పాటు చేశామన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ స్థానంలో మొదటినుంచి మాదిగలకు అన్యాయం జరుగుతుందన్నారు.

ఆలయ కమిటీ ఎన్నిక

సుల్తానాబాద్, మార్చి 10: పట్టణంలోని శాస్త్రీనగర్ అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ నూతన ధర్మకర్తల మండలిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మారవేణి లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శిగా వెంగల భిక్షపతి, ఉపాధ్యక్షులుగా కల్వల సాగర్, కాంతయ్య, బండ గట్టయ్య, కోశాధికారిగా పూసల రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వేముల మల్లేశం, కార్యవర్గ సభ్యులుగా అనంతుల శ్రీనివాస్, బుర్ర శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీని మాజీ సర్పంచ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరి పద్మ మహేందర్‌లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సుల్తానాబాద్ శివాలయం డైరక్టర్ గందె రాజు, గోపాల్, తుమ్మ రాములు, మేరుగు వెంకటేశ్, రవి పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

సుల్తానాబాద్, మార్చి 10: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడానికి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందని దానికి అనుగుణంగా పనులు చేపడుతామని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండలంలోని సాంబయ్యపల్లి, గొల్లపల్లి, నారాయణరావుపల్లి, గర్రెపల్లి, ఐతరాజుపల్లి, నర్సయ్యపల్లి తదితర గ్రామాల్లో పలు అభివృద్ధి పనుల ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా గ్రామాల్లో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టవల్సి ఉందని, ముందుగా మిగిలిన అసంపూర్తిగా వదిలేసిన పనులుకు ప్రాధాన్యం ఇచ్చి వాటిని పూర్తి చేస్తామన్నారు. రాజీవ్ రహదారి నుంచి గర్రెపల్లి స్కూల్ వరకు నిర్మించిన బీటీ రోడ్డును గ్రామంలోని చౌరస్తా వరకు పొడిగించేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయిస్తానన్నారు. నర్సయ్యపల్లి జీపీ భవనానికి ప్రహరీ నిర్మాణం పార్లమెంట్ ఎన్నికల అనంతరం నిధులు కేటాయిస్తామన్నారు. సాంబయ్యపల్లిలో మహిళభవనానికి స్థలం చూపితే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

పలు గ్రామాల్లో మహిళలు మంచినీటి కొరత గురించి ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దాంతో ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. పలు గ్రామాల్లో మాజీ ప్రజాప్రతినిదులు, కాంగ్రెస్ నాయకులు గ్రామ ప్రముఖులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మినుపాల ప్రకాశ్‌రావు, పన్నాల రాములు, దామోదర్‌రావు, మాజీ సర్పంచ్ బండారి రమేష్, దర్శనాల రాజు, పొల్సాని సంపత్‌రావు, రాజలింగం, ఇల్లెందుల శ్రీనివాస్ గౌడ్, ఎంపీటీసీలు పులి అనూష, గట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

- యువత క్రీడలపై ఆసక్తి చూపాలి..

సుల్తానాబాద్: యువత క్రీడలపై ఆసక్తి చూపాలని, చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించి దేహదారుఢ్యాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండలంలోని కనుకులలో యువతకు ఎమ్మెల్యే క్రికెట్ కిట్లను అందజేశారు. ఆదివారం రాత్రి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కనుకుల గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఇల్లెందుల శ్రీనివాస్‌గౌడ్ సమకూర్చిన క్రికెట్ కిట్లను యువతకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోలు అంజయ్య, ఎంపీటీసీ మీన లక్ష్మీసత్తన్న, గౌడ సంఘం అధ్యక్షుడు మేరుగు శ్రీనివాస్, ఎల్ల స్వామి, ఇల్లెందుల సదయ్య క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



గొల్లపల్లిలో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

- రామగుండం సీపీ శ్రీనివాసులు

మంథని/రామగిరి, మార్చి 10: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తమఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి రామగుండం సీపీఎం శ్రీనివాసులు సూచించారు. మంథని, రామగిరి పోలీస్‌స్టేషన్లను రామగుండం సీపీ శ్రీనివాసులు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, మంథని సీఐ వెంకటేశ్వర్లు మొక్కను అందించి సీపీకి ఆహ్వానం పలికారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలతో పాటు పోలీస్‌స్టేషన్‌లోని రిసెప్షన్ సెంటర్లను సీపీ సందర్శించి రికార్డులను పరిశీలించారు. పోలీస్ అధికారులు సిబ్బంది వివరాలు, నిర్వహిస్తున్న పనితీరు, వారికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ పరిధి భౌగోళిక పరిస్థితులు, ప్రాజెక్టులు, ముఖ్యమైన ప్రదేశాలు, గ్రామపంచాయతీలు, అనుబంధ గ్రామాలు, పోలీస్‌స్టేషన్ పరిధి గ్రామాల్లో ఎలాంటి నేరాలు అధికంగా జరుగుతున్నాయనే, వాటిని ఏవిధంగా నియంత్రణ చేయాలి అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవరిస్తూ కేసుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని జాప్యం చేయకుండా పరిష్కరించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో బీట్లు, పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహిస్తూ నేరాలను నియంత్రణ చేయాలన్నారు. పోలీసు సిబ్బంది ప్రతీఒక్కరు బాధ్యతాయుతంగా ఉంటూ తమతమ విధులు క్రమశిక్షణతో నిర్వహించాలన్నారు. నేరాలు అదుపు చేసేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారన్నారు. రాబోయే ఎన్నికల సందర్భంగా ఎన్నికల సమయంలో సమస్యలును సృష్టించిన వారిపై పూర్తి నిఘా ఉంచుతామని, రౌడీ షీటర్స్‌ను, సస్పెక్ట్ షీట్ ఉన్నవారిని, హిస్టరీ షీట్ ఉన్నవారిని బైండోవర్ చేయాలన్నారు. ఎన్నికల సమయంలో కమ్యూనికేషన్ అనేది చాలా ముఖ్యం. పొలిటికల్ వైలెన్స్, దాడులు, లాఅండ్ ఆర్డర్ సమస్య, గొడవలు సృష్టించే అవకాశం ఉన్న సోషల్ మీడియా సందేశాలు, వీడియోలు వైరల్ చేసే విషయాలు, సమస్యాత్మక గ్రామాలను విధిగా పర్యటిస్తూ గ్రామాలపై దృష్టిసారించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో కూడా ఎన్నికల్లో ప్రజలు ఎవరు గొడవలకు తావులేకుండా స్వచ్ఛందంగా తమ నచ్చిన విధంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వపాలసీలకు వ్యతిరేకంగా పాల్పడే చట్ట వ్యతిరేకమైన చర్యలపై, చేసే వారిపై ప్రత్యేకంగా నిఘా ఉంటుందని చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలు చేసేవారిని ఉపేక్షించేది లేదని పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. ఎలాంటి చట్టవిరుద్ధమైన చర్యలు చేపట్టినా సహించేది లేదని ప్రవర్తన మార్చుకోవాలని హెచ్చరించారు. అక్రమ దందాలు అరికట్టేందుకు స్థానిక పోలీస్, టాస్క్‌ఫోర్స్ పని చేస్తున్నాయని, చట్టవ్యతిరేకమైన చర్యలు చేసే వారిపై కేసులు కూడా చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ వెంకట కృష్ణ, రామగిరి ఎస్ఐ సందీప్ పాల్గొన్నారు.



సీఐ, ఎస్‌తో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాసులు

ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అతిథులు

సుల్తానాబాద్, మార్చి 10: మండంలోని గర్రెపల్లిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు కొనసాగే ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లా పరిధిలోని పలు మండలాల నుంచి ముప్పై క్రీడా జట్లు పాల్గొన్నట్లు వాలీబాల్ పోటీల నిర్వాహకుడు, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు కన్న రమేష్ తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నల్ల మనోహర్ రెడ్డి, గర్రెపల్లి మాజీ సర్పంచ్ పడాల అజయ్, ఎంపీటీసీ పులి అనూష, మాజీ ఎంపీటీసీ పులి వెంకటేశం ఉమ్మడి జిల్లాలోని వాలీబాల్ అసోసియేషన్ నాయకులు కోచ్‌లు సీనియర్ క్రీడాకారలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు సన్మానం

కాల్వశ్రీరాంపూర్, మార్చి 10: మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు గౌడ సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్‌లో సన్మానం చేసినట్లు ఎంపీపీ సర్వాయిపాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గోపగోని సారయ్యగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు బైరి రవిగౌడ్, బుర్ర శ్రీనివాస్‌గౌడ్, గోపగోని శ్రీకాంత్‌గౌడ్, గోపగోని కార్తీక్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ సభ్యుడి ఎంపికపై హర్షం

కాల్వశ్రీరాంపూర్, మార్చి 10: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడిగా గోదావరిఖనికి చెందిన పారిశ్రామిక ప్రాంతానికి చెందిన దళిత నేత వడ్డేపల్లి రామచందర్ ఎంపిక పట్ల ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు లంక సదయ్య హర్షం వ్యక్తం చేశారు. ఆయనతో పాటు ఆ శాఖ రాష్ట్ర కార్యదర్శి పాల రాజేశం, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జూపాక ఉమామహేశ్వర్, మండ అధ్యక్షుడు ఆవునూరి జగన్ హర్షం వ్యక్తం చేశారు. వడ్డేపల్లిని ఎంపిక చేసినందుకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, ప్రధాని మోదీకి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక చేయూత

ఎలిగేడు, మార్చి 10: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న వీరహనుమాన్ ఆలయ నిర్మాణానికి ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఆర్థిక చేయూత అందించారు. వెంగల్‌దాస్ శ్రీధర్ అనే వ్యక్తి 3,33,333 రూపాయలను అందించారని వీరహనుమాన్ ఆలయ కమిటీ పేర్కొంది. సొంత గ్రామానికి ఎంతో కొంత సహాయం చేయడం సంతోషంగా ఉందని శ్రీధర్ పేర్కొన్నారు.

రామగుండం అభివృద్ధే ప్రధానఎజెండా

- త్వరలో ఐటీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్
- ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, మార్చి 10: రామగుండం అభివృద్ధే తన ప్రధాన ఎజెండా అని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. ఆదివారం రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో .6.5 కోట్ల రూపాయలతో వివిధ డివిజన్లలో పట్టణ ప్రగతి, డీఎంఎఫ్‌టీ, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గోదావరిఖని మెయిన్ చౌరస్తాలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండానికి పూర్వవైభవం తీసుకురావాలంటే ఈ ప్రాంతం అన్ని రకాలుగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో కాగితాలు ఇచ్చారే తప్ప నిధులు ఇవ్వలేదన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎంపికైనప్పటి నుంచి ప్రధానమైన అన్నిశాఖల చుట్టూ తిరిగానని, ఒక్కొక్క శాఖకు 10 నుంచి 15లేఖలు రాశానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ.100కోట్లు, డీఎంఎఫ్‌టీ, స్పెషల్ ఫండ్, ఇతర నిధులు మరో రూ.50కోట్లు మంజూరు చేయించానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 200యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత ప్రయాణం వంటి స్కీములు అమలు చేసిందన్నారు. రాష్ట్రంలోని మహిళలు ఒక్కొక్కరు సరాసరి 10 నుంచి 15సార్లు ఉచితబస్సు ప్రయాణాన్ని ఉపయోగించుకున్నారని ఆయన అన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇంటి పథకాన్ని ప్రారంభించబోతున్నామన్నారు. రామగుండం యువతకు ఉపాధినిచ్చేందుకు జాబ్‌మేళాలు పెట్టామని, త్వరలోనే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తామన్నారు. ఇంజనీరింగ్ వంటి ఐటీ కోర్సులు చదువుకున్న వారు ఉద్యోగాలు సంపాదించుకునేందుకు వీలుగా ఐటీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను కూడా త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

- క్షీరాభిషేకాలు చేశామే తప్ప పైసలు రాలేదు..

రామగుండం నగర అభివృద్ధికి నిధులు మంజూరు అయ్యాయంటూ గతంలో ఆదేశాలు ఇచ్చారని, దీంతో తాము క్షీరాభిషేకాలు చేశామని, కానీ పైసా మాత్రం రాలేదని మేయర్ బంగి అనిల్‌కుమార్ పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు టీయూఎఫ్ఐడీసీ రూ.100కోట్లు వచ్చాయని పేపర్ పంపారని, నిధులు లేకపోవడంతో రద్దు అయ్యాయన్నారు. గతంలో నిధుల కోసం సింగరేణి, ఎన్‌టీపీసీ సంస్థలను అడుక్కునే పరిస్థితి ఉండేదని, ఎమ్మెల్యేగా రాజ్‌ఠాకూర్ ఎన్నికయ్యాక ఆదేశాలు ఇస్తున్న పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వ పెద్దల వెంట పడి రూ.150కోట్లు నిధులు ఇప్పించారని, ఒక లక్ష్మీనగర్‌కే రూ.10కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులు పెట్టాడన్నారు. రూ.255కోట్ల అమృత్ నిధులు కూడా ఇప్పించినట్లు మేయర్ తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ముస్తాఫా, బొంతల రాజేష్, కొలిపాక సుజాత, పాతిపెల్లి లక్ష్మి, శంకర్‌నాయక్, దాతు శ్రీనివాస్, పెద్దెల్లి తేజస్వి, అడ్డాల స్వరూప, నాయకులు పాతిపెల్లి ఎల్లయ్య, పెద్దెల్లి ప్రకాష్, తిప్పారపు శ్రీనివాస్, బొమ్మక శైలజ తదితరులు పాల్గొన్నారు.

- పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు..

పాలకుర్తి: దేశానికి పల్లెలే పట్టుకొమ్మలని, ఇందిరమ్మ కన్న కలలను నిజం చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. ఆదివారం పాలకుర్తి మండలంలో 1 కోటి 60 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రధాన రహదారి అయిన బసంత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాల నుంచి ఈసాల తక్కళ్లపల్లి సమ్మక్క, సారలమ్మల గద్దెల వరకు డీఎంఎఫ్‌టీ నిధులు కోటి 60 లక్షల రూపాయలతో రోడ్డు నిర్మాణ పనులను చేపట్టామన్నారు. పట్టణ ప్రాంతాలకు ధీటుగా పల్లెలను అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ ఏకైక లక్ష్యమన్నారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లందకుంట, మార్చి 10: మానేరు పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై రాజకుమార్ తెలిపారు. ఆదివారం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కనగర్తి గ్రామం మీదుగా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

- మరో ముగ్గురికి అస్వస్థత
- బోరు మోటారు దించే క్రమంలో ఘటన

కోనరావుపేట, మార్చి 10: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని కోనరావుపేట మండలం బావుసాయిపేటలో ఆదివారం విద్యుదాఘాతంతో పంబాల భూమయ్య (35) అనే రైతు మృతి చెందాడు. మరో ముగ్గురు అస్వస్థతకు గురయ్యారు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం బావుసాయిపేటలోని తిక్కుల భూమయ్యకు చెందిన వ్యవసాయ భూమి వద్ద బోరు బావిలో మోటారు దించడానికి రైతులను తీసుకెళ్లాడు. మోటారు దించుతున్న క్రమంలో పైన ఉన్న విద్యుత్ తీగలు బోరు బావి పైపునకు తగలడంతో నలుగురు రైతులు విద్యుదాఘాతానికి గురయ్యారు. వారిలో పంబాల భూమయ్య అనే రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. పంబాల రాజు, కర్నాల మహేష్, తుపాకుల శ్రీనివాస్ అస్వస్థతకు గురవగా అక్కడే ఉన్న మరి కొంతమంది రైతులు వేములవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆసుపత్రికి చేరుకొని రైతు కుటుంబాలను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. మృతి చెందిన పంబాల భూమయ్యకు భార్య అనిత, కుమారుడు రేశ్వంత్, కూతురు గౌతమి ఉన్నారు.


భూమయ్య(ఫైల్)

రోడ్డుపై ధర్నా.. పోలీసు విధులకు ఆటంకంపై కేసు

కరీంనగర్ క్రైం, మార్చి10: కరీంనగర్‌లోని రాంనగర్ చౌరస్తాలో ఆదివారం రాత్రి స్థానికులు కొందరు ధర్నాకు దిగారు. డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల సందర్భంలో ట్రాఫిక్ పోలీసులు దురుసుగా ప్రవర్తించారంటూ రోడ్డుపై బైఠాయించి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. రెండో టౌన్ సీఐ రమేశ్ సంఘటనా స్థలానికి వెళ్లి ధర్నాను విరమింపజేశారు. ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన కొందరు తమ వాహనాలను ఇవ్వాలని పోలీసులతో వాగ్వాదం చేస్తూ విధులకు ఆటంకం కలిగించారని రెండో టౌన్ సీఐ రమేశ్ తెలిపారు. పోలీసుల విధులను ఆటంకపరిచినందుకు ఇద్దరిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. పట్టుకున్న వాహనాలను టౌన్‌కు తరలించినట్లు తెలిపారు.

గోపాల్‌రావుపేటలో చోరీ

రామడుగు, మార్చి 10: మండలంలోని గోపాల్‌రావుపేటలోని ఓ ఫొటో అండ్ వీడియో షాపులో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గోపాల్‌రావుపేట బస్టాండ్ వద్ద మధు అనే యువకుడు ఫొటో స్టూడియోతో పాటు గడియారాల షాపును నిర్వహిస్తున్నాడు. షాపు యజమాని ఆదివారం ఉదయం షాపును తీసేందుకు వెళ్లగా వెనుక తలుపు తీసి ఉండడాన్ని గమనించాడు. దుకాణంలో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో కౌంటర్‌లో చూడగా రూ. 10,500 కనబడలేదు. దీంతో పాటు దుకాణంలో ఉన్న 20 గడియారాలు చోరీకి గురి అయినట్లు గమనించి పోలీసులకు సమాచారం అందించాడు సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై సురేందర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమీపంలోని నాలుగైదు దుకాణాల షాపుల తాళాలను పగుకొట్టేందుకు ప్రయత్నించగా అవి రాకపోవడంతో వెళ్లిపోయినట్లు ఆయా దుకాణాల యజమానులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కరీంనగర్ క్రైం, మార్చి 10: కరీంనగర్‌లోని పాతబజారులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పాతబజారుకు చెందిన శివరవీందర్(64), ఆయన తల్లి శివసువర్ణ(85)లకు తీవ్ర గాయాలయ్యాయని ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. రాఘవేంద్రనగర్ నుంచి ద్విచక్ర వాహనంపై పాతబజారుకు వెళ్తుండగా ఒక ద్విచక్రవాహనం వేగంగా వచ్చి ఢీకొట్టిందని తెలిపారు. గాయపడిన ఇద్దరిని 108లో ప్రభుత్వ ఆసుపత్రికి, ఆ తరువాత ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారని పోలీసులు తెలిపారు.

చదరంగ పోటీలకు స్పందన

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 10: జీనియస్ చెస్ అకాడమి, తెలంగాణ డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జీనియస్ చెస్ అకాడమిలో నిర్వహించిన మహిళల ఉమ్మడి జిల్లా స్థాయి చదరంగ పోటీలకు విశేష స్పందన లభించింది. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 65 మంది పాల్గొని ప్రతిభ చాటారు. ప్రైమ్ కిడ్నీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ చాందిని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో జీనియస్ చెస్ అకాడమి వ్యవస్థాపకుడు కనకయ్య, డాక్టర్ కృష్ణ చైతన్య, భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్తాక అధ్యక్షుడు నాగరాజు, సైకియాట్రిస్ట్ అనిత తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


ప్రతి గ్రామంలోనూ రెవెన్యూ ఉద్యోగి ఉండేలా చర్యలు చేపట్టాలి

సీఎంను కోరిన డిప్యూటీ కలెక్టర్ల, రాష్ట్ర తహసీల్దార్ల అసోసియేషన్లు

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థలను బలోపేతం చేయాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని డిప్యూటీ కలెక్టర్ల, రాష్ట్ర తహసీల్దార్ల అసోసియేషన్ల సభ్యులు కోరారు. ఆదివారం డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె. రామకృష్ణ, ఎస్.ఆర్ సరిత, తెలంగాణ తహసీల్దార్ల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రాములు, రమేశ్ పాక, అసోసియేట్ ప్రెసిడెంట్ పూల్‌సింగ్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు, పూర్వ వీఆర్ఓ, వీఆర్‌ఏల పెండింగ్ సమస్యలు, తహసీల్దార్ల అద్దె వాహనాలకు బిల్లుల చెల్లింపు, క్యాడర్ బలోపేతం, తదితర అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత రెవెన్యూ డివిజన్లు, మండలాలు పెరిగినా.. రెవెన్యూ ఉద్యోగుల సంఖ్య పెరగలేదని చెప్పారు. దీంతో ఉన్న ఉద్యోగుల మీదనే పని భారం పడుతోందని, జిల్లాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్లకు అనుగుణంగా క్యాడర్‌ను పెంచాలని సీఎంను కోరారు. ప్రతి గ్రామంలోనూ రెవెన్యూ ఉద్యోగి ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. జీఏడీ పరిధిలోని అదనపు కలెక్టర్ల పోస్టుల వ్యవహారాన్ని రెవెన్యూ విభాగ పరిధిలోకి తేవాలని విజ్ఞప్తి చేశారు. అన్ని అంశాలపై సీఎం సానుకూలంగా స్పందించినట్టు అసోసియేషన్ల ప్రతినిధులు తెలిపారు.

నేటి నుంచి లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలు

- తొలిరోజు పూజల్లో పాల్గొననున్న సీఎం
- పట్టు వస్త్రాలు, తలంబ్రాల సమర్పణ



లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో విద్యుద్దీపాల వెలుగులు

యాదగిరిగుట్ట, మార్చి 10: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. సోమవారం ఉదయం 10గంటలకు ప్రధానాలయ ముఖ మండపంలో అర్చక, వేదపండితుల బృందం సంప్రదాయరీతిలో లక్ష్మీనృసింహుల తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. తొలిరోజు వైదిక పూజల్లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనున్నారు. ఆయన సోమవారం ఉదయం 9గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి కాన్వాయ్‌లో కొండపైకి చేరుకుని వీవీఐపీ అతిథి గృహంలో కాసేపు విశ్రాంతి తీసుకుంటారు. 9.30గంటలకు ప్రధానాలయంలో స్వయంభువులను దర్శించుకుంటారు. స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవస్థాన అధికారులకు అందజేస్తారు. ఉదయం 11గంటలకు రేవంత్ హెలికాప్టర్‌లో భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయానికి బయల్దేరివెళతారు. సీఎం రేవంత్ పర్యటన నేపథ్యంలో కొండ కింద పాత గోశాల ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న హెలీప్యాడ్ వద్ద పనులను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఆదివారం పరిశీలించారు. బ్రహ్మోత్సవాల తొలిరోజు పూజల్లో సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి, పలువురు మంత్రులు పాల్గొంటారని అధికారులు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఈసారి రూ.1.60కోట్లు కేటాయించామని, అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో రామకృష్ణారావు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 18న జరిగే తిరుకల్యాణోత్సవంలో భక్తులు పాల్గొనే విధంగా 600 టికెట్లను విక్రయిస్తామని, ఒక్కో టికెట్ ధర రూ.3వేలని తెలిపారు. కాగా, బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 17న రాత్రి ఎదుర్కోలు, 18న రాత్రి తిరుకల్యాణోత్సవం, 19న రాత్రి దివ్య విమాన రథోత్సవ ఘట్టాలను నిర్వహిస్తారు. ఈ నెల 20న మహాపూర్ణాహుతి, చక్రతీర్థ స్నానం ఉంటుంది. 21వ తేదీన అష్టోత్తర శతఘటాభిషేకం, పండిత సన్మానంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయి.

లోకం తీరు



ఉద్యోగులకు ఏడో గ్యారెంటీ!

(మొదటి పేజీ తరువాయి)



ఇస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల డీఏ, పీఆర్సీపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆదివారం ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ఎంసీహెచ్ఆర్డీలో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇన్ని రోజులూ ఆయా ప్రభుత్వ ఉద్యోగ సంఘాలకు గౌరవ అధ్యక్షులుగా ఉన్నది కేసీఆర్ కుటుంబమేనన్నారు. నిర్బంధాలతో పాలన సాగిస్తామనుకోవడం వారి భ్రమ అని, సమస్యలకు చర్చలే పరిష్కారం తప్ప.. నిర్బంధాలు కావని అన్నారు. ప్రభుత్వంపై ఉద్యోగులకు విశ్వాసం కల్పించడానికే చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించామని గుర్తు చేశారు. మంత్రివర్గ ఉపసంఘం శాఖలవారీగా సమావేశం నిర్వహించి నిర్ణయాలు తీసుకుంటుందని, సంఘాలతో చర్చించకుండా నిర్ణయాలు తీసుకోబోమని స్పష్టం చేశారు. ఉద్యోగుల డీఏతో పాటు ఇతర అంశాలపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని, వివిధ శాఖల్లో ఉన్న 1100 మంది రిటైర్డ్ ఉద్యోగుల కొనసాగింపుపైనా త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలకు ఉచితంగా విద్యుత్తు ఇచ్చే విషయంలోనూ క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కిందిస్థాయి సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. ఉద్యోగులకు ఒకటో తారీకునే జీతాలు వేసినా తాము ప్రచారం చేసుకోవడం లేదన్నారు. రోజుకు 18 గంటలు పనిచేస్తూ పాలనను గాడిలో పెడుతున్నామని చెప్పారు.

తెలంగాణ బాపు కేసీఆర్ కాదు..

మాజీ సీఎం కేసీఆర్ తనకు తాను తెలంగాణ బాపుగా చెప్పుకొంటున్నారని, అలా చెప్పుకోవడానికి కనీస పోలిక ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ బాపు, సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ అని, తెలంగాణ ఆత్మను గౌరవించకపోతే సమాజం మనల్ని క్షమించదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఆదాయం పడిపోతే.. మద్యంపై వచ్చే ఆదాయంపైనే ఆధారపడేలా కేసీఆర్ పాలన సాగిందని విమర్శించారు. విద్యార్థి, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని రేవంత్ అన్నారు. రక్తం చిందించకుండా తెలంగాణ సాధించామని కేసీఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడారని విమర్శించారు. కేసీఆర్ కుటుంబంలో ఎవరి రక్తమూ చిందలేదని, కానీ.. కానిస్టేబుల్ కిష్టయ్య లాంటివారు రక్తాన్ని చిందించారని, శ్రీకాంతాచారి లాంటివారు మాంసపు ముద్దలయ్యారని అన్నారు. టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్‌ను శాసన మండలికి తప్పక పంపుతామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆయన ఎమ్మెల్సీగా ఉంటే శాసనమండలికి గౌరవమన్నారు. ఈ విషయంపై గవర్నర్ తమిళిసైతో మాట్లాడతానన్నారు. ఈ సమావేశంలో మంత్రి డి.శ్రీధర్‌బాబు, కోదండరామ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

టీచర్లు, ఉద్యోగులలో సంతోషం..

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో పదేళ్ల తర్వాత ముఖ్యమంత్రి ముఖాముఖి సమావేశం కావడం పట్ల ఆయా సంఘాలు సంతోషం వ్యక్తం చేశాయి. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ప్రత్యేక చొరవతో ఏర్పాటైన ఈ సమావేశంలో.. ప్రధాన డిమాండ్లను సీఎం దృష్టికి టీజీవోఏ తీసుకెళ్లింది. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏల్లో మూడింటిని ఇవ్వాలని, సీపీఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరింది. వీటితోపాటు పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న హెల్త్ కార్డులను వెంటనే ఇవ్వాలని, పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని విన్నవించింది. కాగా, ముఖ్యమంత్రి రెండు గంటలపాటు తమ సమస్యలపై మాట్లాడమే కాకుండా ఎంతో ఓపికగా విన్నారని సంఘాల నేతలు తెలిపారు. గతంలో కనీసం సమస్యలు వినే పరిస్థితి కూడా ఉండేది కాదన్నారు. కాగా, వైద్యశాఖలో పని చేస్తున్న మెడికల్ సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ అందరినీ బదిలీ చేయాలని మెడికల్ జేఏసీ.. ముఖ్యమంత్రిని కోరింది. ఉస్మానియాకు కొత్త భవనం కట్టాలని, అశాస్త్రీయంగా ఉన్న మెడికల్ కాలేజీల సంఖ్యను తగ్గించాలని సూచించింది. ఆస్పత్రుల్లో విధులకు వచ్చే నర్సులు దుస్తులు మార్చుకునేందుకు కనీసం రూమ్‌లు లేని విషయాన్ని నర్సుల అసోసియేషన్ సీఎం దృష్టికి తీసుకెళ్లింది. ఇక సాధారణ బదిలీలు, పదోన్నతులు, 317 సమస్యను పరిష్కరించాలని, ఉపాధ్యాయ, ఉద్యోగుల సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ పునరుద్ధరణపై ఆయా సంఘాల ప్రతినిధులు సీఎంకు వినతి పత్రం ఇచ్చారు. ప్రధానంగా టీచర్లకు సంబంధించిన మల్టీజోన్, స్పౌజ్ సమస్యలు, స్థానికత, బదిలీలు, ఆరోగ్య బీమా, పెండింగ్ డీఏ లాంటి సమస్యలను వివరించారు. కాగా వినతి పత్రాలను కొన్నింటిని సీఎం నేరుగా తీసుకున్నారు.

సీఎంకు పీఆర్‌టీయూ నేతల కృతజ్ఞతలు

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించడమే కాకుండా సమస్యల్ని త్వరలోనే పరిష్కరిస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడం పట్ల పీఆర్‌టీయూ నేతలు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, కమలాకర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

అధికారంలోకి వచ్చిన 72 రోజులకే

31వేల ఉద్యోగాలిచ్చాం

మరో గ్యారెంటీకి శ్రీకారం: పొంగులేటి

మాటిస్తే కాంగ్రెస్ మడమ తిప్పదు: సురేఖ

జీవో 3పై కవిత వ్యాఖ్య విడ్డూరం: సీతక్క

వరంగల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తాము అధికారంలోకి వచ్చిన 72 రోజుల్లోనే 32వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి, యుద్ధప్రతిపాదికన ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం నిరుద్యోగ యువత ఉసురు తీసుకుందని, తాము 11,600 టీచర్ ఉద్యోగాల భర్తీకి మెగా డీఎస్సీ కోసం నోటిఫికేషన్ ఇచ్చామని పేర్కొన్నారు. ఆదివారం హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీలో రూ.68 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు, వరంగల్ నగరంలో రూ.280.85 కోట్లతో చేపట్టిన పనులకు మంత్రులు కొండా సురేఖ, సీతక్కతో కలిసి ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే నాలుగు పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. అర్హులైన పేదలందరికీ సొంతింటి కలను సాకారం చేస్తామని తెలిపారు. ఒకటో తేదీ నుంచి మూడో తేదీలోపు ఉద్యోగులకు వేతనాలు ఇస్తున్న ప్రభుత్వం తమదని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట తప్పదని మంత్రి కొండా సురేఖ అన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, అందులో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ నగరానికి రూ.260కోట్ల నిధులు కేటాయించారని తెలిపారు. జీవో నంబరు 3కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మాట్లాడడం విడ్డూరమని, అసలు ఆ జీవో ఇచ్చిందే కేసీఆర్ ప్రభుత్వమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తప్పుడు ప్రచారాలు బంద్ చేసి, నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించాలని సూచించారు.

భట్టి నాకు ద్రోహం చేస్తున్నారు

- ఖమ్మం టికెట్‌ను అడ్డుకుంటున్నారు: వీహెచ్

న్యూఢిల్లీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తనకు ద్రోహం చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ హనుమంతరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఖమ్మం లోక్‌సభ సీటు తనకు రాకుండా భట్టి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఆదివారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో విలేకరుల సమావేశంలో వీహెచ్ మాట్లాడారు. 'భట్టిని అప్పట్లో ఎమ్మెల్సీని చేయడంలో నాదే కీలక పాత్ర.. భట్టి ఈరోజు పార్టీలో ఈస్థానంలో ఉండడానికి కారణం నేనే.. 2019 వరకు ఖమ్మంలో ప్రతి కార్యక్రమానికి ఆయన నన్ను రమ్మన్నారు.. ఆ తర్వాత పిలవడం మానేశారు. పనిచేసినోడికి ముఖ్యమంత్రి పదవి రావాలని నేను అన్నందుకే నాపై కక్ష కట్టారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ పార్టీ కోసం చాలా కష్టపడ్డారని చెప్పారు. 'రాహుల్‌ఖమ్మం నుంచి పోటీ చేస్తే నేను తప్పుకుంటా.. లేదంటే ఆ సీటుకు నేను అన్నివిధాల అర్హుడిని.. ఖమ్మం టికెట్ ఇస్తే భారీ మెజారిటీతో గెలుస్తా.. పదవి ఉన్నా లేకపోయినా చనిపోయేవరకు కాంగ్రెస్‌లోనే ఉంటా.. చనిపోయిన తర్వాత పార్టీ జెండా నాపై ఉంటుంది' అని వ్యాఖ్యానించారు.

వీహెచ్‌కు ఖమ్మం టికెటిస్తే కలిసికట్టుగా గెలిపిస్తాం

- నేను అడ్డుపడడం..ఆయన అపోహే: భట్టి

చింతకాని, మార్చి 10: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికలో కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీదే తుది నిర్ణయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆ కమిటీ నిర్ణయం మేరకే అభ్యర్థుల ఎంపిక ఉంటుదని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో పర్యటించిన భట్టి.. ఎంపీ టికెట్ల కేటాయింపు విషయమై పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. పార్టీ అధిష్ఠానం వీహెచ్‌కు ఖమ్మం ఎంపీ టికెట్ ఇస్తే జిల్లా మంత్రులు, నాయకులు, కార్యకర్తలు.. అందరం కలసికట్టుగా పనిచేసి గెలిపించుకుంటామని చెప్పారు. ఖమ్మం ఎంపీ టికెట్ వీహెచ్‌కు రాకుండా తాను అడ్డుపడటం లేదని.. అది కేవలం ఆయన అపోహ మాత్రమేనన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడిగా వీహెచ్‌కు తన పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుతో పాటు రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తమ తక్షణ కర్తవ్యమన్నారు. లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక విషయంలో అధిష్ఠానం నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉంటామని తెలిపారు.

మాకు న్యాయం చేయండి

- 317 జీవో వల్ల బాధితులుగా మారాం
- మంత్రి దామోదరను కలిసిన నర్సులు

గత సర్కారు హయాంలో విడుదల చేసిన జీవో నంబరు 317 వల్ల తాము బాధితులుగా మారామని, తమకు న్యాయం చేయాలని కోరుతూ నర్సులు వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఆదివారం ఆయన నివాసంలో కలిశారు. తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. గత ప్రభుత్వం నిరంకుశంగా జోనల్ వ్యవస్థను తీసుకొచ్చి తమ జీవితాలతో చెలగాటం ఆడుకుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 317జీవోపై క్యాబినెట్ సబ్ కమిటీలో చర్చించి, అందరికీ న్యాయం చేస్తామనిమంత్రి ఉద్యోగులకు భరోసానిచ్చారు.

పేదింటి పండుగ

నేడు 'ఇందిరమ్మ ఇల్లు' పథకం ప్రారంభించనున్న సీఎం రేవంత్



హైదరాబాద్, ఖమ్మం/భద్రాచలం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పేదవాడి సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. "ఇందిరమ్మ ఇల్లు" పథకం కార్యరూపం దాల్చనుంది. రాములవారు కొలువైన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం భద్రాచలంలో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ ప్రాంగణం దీనికి వేదిక కానుంది. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఇందిరమ్మ ఇల్లు ఐదోది. అధికారంలోకి వచ్చాక మూడు నెలల్లో నాలుగు పథకాలను అమలు చేసింది. కాగా, ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించి మూడు నమూనాలను కూడా సోమవారం ప్రకటించనున్నారు. పథకం అమలుకు అవసరమైన మార్గదర్శకాలను సర్కారు సిద్ధం చేసింది. ఇల్లు లేని అర్హులైన పేదలందరికీ దశలవారీగా వర్తింపజేయనున్నారు. స్థలం ఉన్నవారికి రూ.5 లక్షలు, లేనివారికి స్థలం ఇచ్చి రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేయనున్నారు. ఈ మొత్తాన్ని నాలుగు దశల్లో మంజూరు చేస్తారు. ఈ ఏడాదిలో నియోజకవర్గానికి 3,500 చొప్పున 119 నియోజకవర్గాలకు 4,16,500 ఇళ్లను మంజూరు చేయగా.. రిజర్వ్ కోటా (సీఎం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పరిధి)లో మరో 33,500 కేటాయించారు. మొత్తంగా 4.50లక్షల ఇళ్లు మంజూరు కానున్నాయి. తొలి దశలో సొంత స్థలం ఉన్నవారికి అందనుండగా.. స్థలం లేనివారికి రెండో దశలో పథకాన్ని వర్తింపజేస్తారు. ఇంటి నిర్మాణం విషయంలో లబ్ధిదారుదే పూర్తి నిర్ణయం అయినప్పటికీ.. ఆర్‌సీసీ స్ట్రక్చర్‌తో పాటు కచ్చితంగా వంట గది, బాత్‌రూమ్ ఉండాలి. అనంతరం 'ఇందిరమ్మ ఇల్లు' పథకం కింద నిర్మించినదని తెలిసేలా 'అభయహస్తం' లేదా ప్రత్యేకంగా తయారు చేసే కొత్త లోగోను ఉంచనున్నారు. కాగా బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాల విషయంలో చేసిన తప్పులు ఈసారి జరగకుండా, అర్హులకే పథకం అందేలా మార్గదర్శకాలను ఖరారు చేశారు. ఈ పథకానికి అర్హులైన వారు దాదాపు 30-40 లక్షలమంది ఉండొచ్చని ప్రభుత్వం అంచనా వేస్తోంది. 'ప్రజాపాలన' దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తయ్యాక హెచ్చుతగ్గులు ఉండొచ్చని కూడా భావిస్తోంది. దరఖాస్తు లన్నింటినీ క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు అవసరమైతే గ్రామసభల్లోనూ మరోసారి పరిశీలించనున్నారు. గ్రామసభల్లో వివరాలను నమోదు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఒక ప్రొఫార్మాను రూపొందించింది.

పథకం కోసం రుణం..

ఇందిరమ్మ ఇల్లు పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం హడ్కో నుంచి రూ.3 వేల కోట్ల రుణం తీసుకోనుంది. ఎన్ని ఇళ్లను ఏయే దశల్లో నిర్మిస్తామనే వివరాలను కూడా తెలిపింది. తొలి శలో గ్రామీణ ప్రాంతాల్లో 57,141, పట్టణాల్లో 38,094 ఇళ్లను నిర్మిస్తామని పేర్కొంటూ ఈ నె 5న జీవో విడుదల చేసింది. దీని ప్రకారం నియోజకవర్గానికి 800 ఇళ్లు అందనున్నట్లు తెలుస్తోంది. ఈ గణాంకాలు, అంచనాలు హడ్కో రుణం కోసం సంబంధించినవేనని సమాచారం. వీటికి మరికొన్ని కలిపి ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయనుంది. 'ఇందిరమ్మ ఇల్లు' పథకాన్ని మహిళ పేరు మీద అందిస్తారు. ప్రత్యేక పోర్టల్ ద్వారా నిర్మాణాలను పర్యవేక్షిస్తారు. లబ్ధిదారుకి రేషన్ కార్డు కచ్చితంగా ఉండాలి. గతంలో ఇందిరమ్మ ఇల్లు పొంది ఉంటే అనర్హులు. మంజూరైన ఇళ్ల కంటే లబ్ధిదారులు ఎక్కువ ఉంటే.. వారికి మరో విడతలో అందిస్తారు.

సీఎం భద్రాచలం పర్యటన షెడ్యూల్ ఇది..

సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం 12:10 గంటలకు భద్రాచలం రాముడిని దర్శించుకోనున్నారు. 1:30కు వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటుచేసిన సభలో 'ఇందిరమ్మ ఇల్లు' పథకాన్ని ప్రారంభిస్తారు. 2:30 నుంచి 3:30 మధ్య భద్రాచలం ఆలయం, సాగునీటి, దేవాదాయ శాఖ అధికారులతో సమావేశమై సీతారామ, సీతమ్మసాగర్ ప్రాజెక్టుల పనుల పురోగతిపై సమీక్షిస్తారు. సాయంత్రం 4 గంటలకు మణుగూరులో సభకు హాజరవుతారు. 6:10 గంటలకు హైదరాబాద్‌కు తిరిగి చేరుకుంటారు.

భద్రాచలం రామాలయం అభివృద్ధిపై ఆశ

హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా భద్రాచలం వచ్చిన రేవంత్.. అధికారంలోకి వస్తే ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం హోదాలో ఇప్పుడు భద్రాద్రి అభివృద్ధికి వరాలు ప్రకటిస్తారని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం భద్రాచలం అభివృద్ధికి రూ.100కోట్లు ప్రకటించినా రూపాయీ ఇవ్వలేదు.

అప్పుల రాష్ట్రాన్ని అప్పగించినా హామీలు నెరవేరుస్తున్నాం: తుమ్మల



ఖమ్మంకార్పొరేషన్: ప్రజల సొమ్ము దోచుకోవటమే ధ్యేయంగా పనిచేసిన గత ప్రభుత్వం తమకు అప్పుల రాష్ట్రాన్ని అప్పగించినా సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో సాహసంతో ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా బూడిదెంపాడు వద్ద రూ.38.50 కోట్లతో ఖమ్మం-ఇల్లెందు రెండులైన్ల రహదారి నాలుగులైన్లుగా విస్తరణ, అభివృద్ధి పనులకు ఆదివారం మంత్రి శంకుస్థాపన చేశారు. సోమవారం భద్రాద్రి రాముడి సన్నిధిలో సీఎం రేవంత్‌రెడ్డి ఐదో గ్యారెంటీగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తారన్నారు. శ్రీశైలం, సాగర్‌లో నీళ్ల లేకపోవడానికి బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పిదాలే కారణమన్నారు.

బడుల్లో మార్పు రావాల్సిందే!

- మౌలిక సదుపాయాలు కల్పించండి
- సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పూర్తి చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో స్పష్టమైన మార్పు కనిపించాలని.. వాటిపై ప్రజలకు నమ్మకం కలిగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్కారీ బడులు, కళాశాలలకు తక్షణమే ఉచిత విద్యుత్ అమలయ్యేలా చూడాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై ఆదివారం ఎంసీఆర్‌హెచ్ఆర్డీలో ఆయా శాఖల ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష జరిపారు. విద్యార్థులకు యూనిఫామ్‌తో పాటు.. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు, పర్యవేక్షణ బాధ్యతలను స్వయం సహాయక మహిళా సంఘాలకు అప్పగించే అంశాన్ని పరిశీలించాలన్నారు. ఇతర రాష్ట్రాల ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి వాటిని రాష్ట్రంలో అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేసి.. టీ-శాట్ ద్వారా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో డిజిటల్ పాఠాలు అందించాలని, బడులపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుపై దృష్టిసారించాలని, సీఎస్ఆర్ ఫండ్స్ కోసం ప్రయత్నం చేయాలని, సౌకర్యాలను మెరుగుపరచేందుకు ఎన్నారైల సహకారం తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలన్నారు. స్కిల్ యూనివర్సిటీ కోసం ఐఎస్‌బీ తరహాలో గవర్నింగ్ బాడీని ఏర్పాటు చేయాలన్నారు. న్యాక్‌పై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలన్నారు. సచివాలయం నుంచి కిందిస్థాయి వరకూ ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) తీసుకువచ్చే అంశంపై సీఎం చర్చించారు. సమీక్షలో మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి ఫూలేకు ఘన నివాళి



పెద్దపల్లిలో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు


కల్వచర్లలో నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు


కాల్వశ్రీరాంపూర్‌లో..

పెద్దపల్లి కల్చరల్, మార్చి 10: సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆదివారం సీపీఎం పెద్దపల్లి డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు ఎరవెల్లి ముత్యంరావు హాజరై మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే తొలి మహిళా ఉపాధ్యాయురాలని అన్నారు. పీడిత ప్రజల ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలి మహిళ ఉద్యమకారునని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి సీపెల్లి రవీందర్, మోదంపల్లి శ్రావణ్, శివాజీ నవీన్, సునీల్,బిట్టు రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

మంథని: దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా పేరుగాంచిన సావిత్రిబాయిపూలే వర్ధంతిని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాలుళర్పించారు. దేశంలో మహిళలకు, పేద, బడుగు, బలహీన వర్గాలకు వారికి విద్యను నేర్పించడంతో పూలే దంపతులు చేసిన సేవలను, త్యాగాలను కొనియాడారు. ఈకార్యక్రమంలో బూడిద గణేష్, బెజ్జంకి డిగంబర్, బూడిత తిరుపతి, మంథని లింగయ్య, మెండి, రవి, శంకర్, సమ్మయ్య, పోశం, బానేష్, వెంకటస్వామి, దుర్గయ్యలు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పాల రాజేశం, జూపాక ఉమా మహేశ్వర్, మాజీ సర్పంచ్ మాదాసు సతీష్, మాజీ ఎంపీటీసీలు బంగారు లావణ్యరమేష్, దూపం సంపత్, మాస్టిన్ సంఘం రాష్ట్ర కన్వీనర్ దంతనపల్లి చిన్నస్వామి, బీజేపీ మండల అధ్యక్షుడు చిలువేరి సంపత్, వేదవ్యాస హైస్కూల్ డైరెక్టర్ గుర్రం దివాకర్, కరస్పాండెంట్ జూపాక సౌమ్యమహేష్ తదితరులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో సావిత్రిభాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఇనగంటి ప్రేమలత, మాజీ సర్పంచ్ నీలం సరిత, మాజీ ఎంపీటీసీ కొట్టే భూమయ్య, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సాన రామకృష్ణారెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్, మండల అధ్యక్షులు పొన్నం నవీన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పిన్‌రెడ్డి కిషన్‌రెడ్డి, నాయకులు మచ్చగిరి రాము, ఆనవేణి లక్ష్మీరాజం, సతీష్


కమాన్‌పూర్‌లో..

జంగంపెల్లి శ్రీనివాస్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు అంబటి కనుకయ్య, మోహన్, శంకర్, దేవేందర్ తదితరులు ఉన్నారు.

కోల్‌సిటీటౌన్: ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక 33వ డివిజన్ ఫైవింక్లయిన్ పరుశురాంనగర్‌లో సావిత్రి బాయి పూలే వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మహిళలు పేర్క సుజాత, మేదరి ప్రేమలత, పద్మసౌజన్య, రజిని, శ్రీలత, శ్రీనివాస్, రమేష్, రాజేశ్వర్‌రావు, మేకల రాజన్న, బొడ్డు రమేష్ పాల్గొన్నారు.

రామగిరి: మండలంలోని కల్వచర్లలో స్త్రీ విద్యావ్యాప్తికి కృషి చేసిన సావిత్రిబాయిపూలే వర్ధంతి సందర్భంగా ఘననివాళిని అర్పించారు. ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఎస్పీ మంథని నియోజకవర్గం ఇన్‌చార్జి జనగామ రవీకుమార్ ఆధ్వర్యంలో సావిత్రిభాయిపూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ముచ్చకుర్తి శ్రీనివాస్, జాపతి శేఖర్, సైండ్ల సత్యం, బొంకూరి పోచం, కన్నూరి సంపత్, ఆసంరాజు, దండె వేణు,ఓడితెల శ్రీనివాస్, మెట్టు ప్రభాకర్, ఇరుగురాల సాగర్, బొంకూరి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: సీపీఐ(ఎంఎల్) న్యూడెమెక్రసీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఇఫ్టూ కార్యాలయంలో సావిత్రిబాయి పూలె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా న్యూడెమెక్రసీ రాష్ట్ర నాయకుడు ఐ కృష్ణ మాట్లాడారు. మహిళలు, అణగారిన వర్గాల అభివృద్ధి విద్యతో పారదోలవచ్చని నమ్మి, ఆ సిద్దాంతం కోసం జీవితాంతం శ్రమించి సంఘసంస్కర్తగా నిలిచిన నాయకురాలు సావిత్రిబాయి అన్నారు. కార్యక్రమంలో ఈ నరేష్, బీ అశోక్, బుచ్చమ్మ, బండ పద్మ, శారద, రాజనర్సు, గట్టయ్య, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



ఉద్యోగాలకు ఎంపికైన వారితో అదనపు కలెక్టర్ అరుణశ్రీ, మాట్లాడుతున్న సీపీ శ్రీనివాసులు

మంథని, మార్చి 10: నిరుద్యోగ యువత ప్రైవేట్ రంగంలో అందుబాటులో ఉండే ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ అరుణశ్రీ, రామగుండం సీపీ శ్రీనివాసులు సూచించారు. స్థానిక ఓ గార్డెన్స్‌లో తెలంగాణ స్టేట్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్ (టీఎస్-ఎస్‌టీఈపీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను రామగుండం సీపీ శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించగా అదనపు కలెక్టర్ అరుణశ్రీ సందర్శించి ఉద్యోగాలు సాధించిన వారికి ఎంపిక పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కల్పన కోసం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి ఆదేశాల మేరకు మెగా జాబ్ మేళాను జిల్లా యువజన క్రీడ శాఖ అధికారి, జిల్లా ఉపాధి అధికారి ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు. ఐటీ, ఫార్మా, నిర్మాణరంగం, మార్కెటింగ్ మొదలగు వివిధ రంగాలకు చెందిన 65 కంపెనీలు మెగా జాబ్‌మేళాలో పాల్గొన్నాయని, కంపెనీలలో గల ఉద్యోగ అవకాశాల ప్రకారం ఏడో తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు అర్హత ఉన్న విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించడం హర్షనీయమన్నారు. యువత తమకు అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకుంటూ నైపుణ్యాలను పెంపొందించడంపై దృష్టి సారించాలన్నారు. ప్రైవేట్ రంగంలో అనేక ఉద్యోగఅవకాశాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 65 ప్రైవేట్ కంపెనీలతో నిర్వహించిన ఈ జాబ్ మేళాలో మొత్తం 1,377 మంది అభ్యర్థులు టీఎస్ఎస్‌టీఈపీ పోర్టల్‌లో తమ పేరును రిజిస్ట్రేషన్ చేసుకోగా, 330 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు, 629 మంది అభ్యర్థులు షార్ట్ లిస్టులో ఉన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ సురేష్, జిల్లా ఉపాధి అధికారి వై తిరుపతిరావు, ఎంపీపీలు కొండ శంకర్, ఆరెల్లి దేవక్కకొమురయ్య, ధ్రువ్ కన్సల్టింగ్ సర్వీసెస్ చైర్మన్ మన్మోహన్ సంబంధిత అధికారులు, పలు కంపెనీల హెచ్‌ఆర్‌లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని వీడిన గోమాస శ్రీనివాస్

- ఢిల్లీలో తరుణ్ చుగ్ సమక్షంలో బీజేపీలో చేరిక - పెద్దపల్లి టికెట్‌పై హామీ ఇవ్వడం వల్లే బీజేపీలో చేరారని ప్రచారం

పెద్దపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నుంచి పెద్దపల్లి టికెట్ ఆశించిన గోమాస శ్రీనివాస్ ఆ పార్టీని వీడి బీజేపీలో చేరారు. ఆదివారం న్యూఢిల్లీలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్ చుగ్ సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనకు కండువా కప్పి తరుణ్‌చుగ్ పార్టీలోకి ఆహ్వానించారు. పెద్దపల్లి నుంచి ఆ పార్టీకి బరిలో నిలిచే సరైన అభ్యర్థి లేకపోవడంతో 15రోజుల నుంచి గోమాస శ్రీనివాస్‌తో రాజ్యసభ్యుడు లక్ష్మణ్ చర్చలు జరిపినట్టు సమాచారం. కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం తీవ్రమైన పోటీ నెలకొన్నది. వివేక్ తనయుడు గడ్డం వంశీకృష్ణ, మాజీ ఎంపీ డాక్టర్ సుగుణకుమారి, ఊట్ల వరప్రసాద్, ఆసంపల్లి శ్రీనివాస్ తదితరులు టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే బీఆర్ఎస్ సిటింగ్ ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈతరుణంలో గోమాస శ్రీనివాస్ తనకు పార్టీ టికెట్ రాదని భావించిన ఆయన బీజేపీ పార్టీ వైపు మొగ్గు చూపారు. ఆ పార్టీ నాయకులు కూడా పార్టీలో చేరితే ఎంపీ టికెట్ ఇస్తామని హామీ ఇవ్వడంతో ఆయన బీజేపీలో చేరారు. మంథని నియోజకవర్గ పరిధిలోని కాటారం మండలానికి చెందిన గోమాస శ్రీనివాస్ సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ తెలంగాణ ఉద్యమంలోనూ పాలుపంచుకున్నారు. 2009లో బీఆర్ఎస్ పార్టీలో కొనసాగిన ఆయనకు ఆ పార్టీ 2009లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో టికెట్ ఇవ్వడంతో పోటీ చేశారు. అయితే ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ జీ వివేక్ గెలుపొందారు. ఆ తరువాత వివేక్ కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. దీంతో బీఆర్ఎస్‌లో ఉన్న గోమాస శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2014లో జరిగిన ఎన్నికల్లో



బీజేపీలో చేరుతున్న గోమాస శ్రీనివాస్

కాంగ్రెస్ పార్టీ టికెట్ తనకే వస్తుందని భావించినప్పటికీ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇవ్వడంతో మనసు మార్చుకున్న వివేక్ తిరిగి కాంగ్రెస్ గూటికి చేరారు. దీంతో ఆ ఎన్నికల్లో శ్రీనివాస్‌కు టికెట్ దక్కలేదు. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోను ఆయన పార్టీ టికెట్ కోసం ప్రయత్నాలు చేసినప్పటికీ వికారాబాద్‌కు చెందిన ఆగం చంద్రశేఖర్‌కు పార్టీ టికెట్ ఇచ్చింది. మూడు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో శ్రీనివాస్ చెన్నూర్ అసెంబ్లీ టికెట్ ఆశించారు. కానీ ఆ టికెట్ కూడా లభించలేదు. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల టికెట్ కోసం ఆయన తీవ్ర ప్రయత్నాలు చేశారు. కానీ టికెట్ తనకు రాదని భావించి భవిష్యత్ రాజకీయాల దృష్ట్యా బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. అయితే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు గట్టి పోటీనిచ్చే అభ్యర్థులు బీజేపీలో కానరాకపోవడంతో ఆ పార్టీ టికెట్‌పై దృష్టి సారించిన గోమాస శ్రీనివాస్ టికెట్ హామీతోనే బీజేపీలో చేరినట్టుగా ప్రచారం జరుగుతోంది. గోమాస శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీని వీడడం వల్ల ఆ పార్టీకి కొంత నష్టమే జరుగనున్నదని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

కళ్యాణ్‌నగర్, మార్చి 10: ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ చెప్పారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఆటో డ్రైవర్లు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఎన్నికల్లో తనను ఆటో డ్రైవర్లు, వారి కుటుంబ సభ్యులు అఖండ మెజార్టీతో గెలిపించారని, విజయంలో భాగస్వామ్యులైన ఆటో డ్రైవర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కొంతమంది స్వార్థపూరిత నాయకులు ఆటో డ్రైవర్లను వాడుకుంటూ రోడ్డున పడవేస్తున్నారని, ఆటో డ్రైవర్లు ఎలాంటి కోపతాపాలకు పోకుండా కలిసిమెలిసి ఉండాలని పిలుపునిచ్చారు. కొంత మంది తమ రాజకీయ అవసరాల కోసం ఆటో డ్రైవర్లను ఉపయోగించుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా స్వార్థపూరిత నేతలు అమాయక ఆటో డ్రైవర్లను వదిలిపెట్టాలని, ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను ఇప్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా మడిపెల్లి మల్లేష్

రామగుండం కార్పొరేషన్ ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షులుగా ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్,



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆటో యూనియన్ నాయకులు

అధ్యక్షునిగా మడిపెల్లి మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా కండె కృష్ణను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఎండీ రహి, కనుకుంట్ల నారాయణ, రవీందర్, మధు, గట్టయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ చోటు, అధికార ప్రతినిధిగా మాదాసు మనోహర్, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాస్, సంపత్, కుమార్, గట్టయ్య, వెంకటేష్, స్వామి, ప్రచార కార్యదర్శిగా విశ్వనాథ్, సమ్మయ్య, కుమారస్వామి, కోశాధికారిగా మాటేటి రాజేశం, గౌరవ సలహాదారులుగా కాల్వ లింగస్వామి, బొంతల రాజేష్, మహంకాళి స్వామి, దీటి బాలరాజు, తిప్పారపు శ్రీనివాస్, గట్ల రమేష్, ఆసిఫ్ పాషాలను ఎన్నుకున్నారు.

కాంగ్రెస్ హయాంలోనే రైతుల ఆత్మహత్యలు

● మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మారం, మార్చి 10: అరవై ఏళ్ల కాంగ్రెస్ పరిపాలనలో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని మాజీ మంత్రి, పెద్దపల్లి ఎంపీ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. ఆదివారం ధర్మారం మండలం బొమ్మారెడ్డిపల్లి ఎక్స్ రోడ్డులో గల ఓ ఫక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆనాడు కరెంట్ లేక పంట పొలాలకు సాగునీరందక అన్నదాతలు అనేక ఇబ్బందులు పడ్డారని ఆయన పేర్కొన్నారు. పోరాటం చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా అనేక మార్పులు చేశారన్నారు. రైతులకు సాగు నీటి విషయంలో ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశంతో సాగునీటి ప్రాజెక్ట్‌ల నిర్మాణాలకు రూపకల్పన చేసి త్వరగా పూర్తిచేసి సాగు నీరందించారని ఆయన చెప్పారు. వ్యవసాయ రంగానికి, పరిశ్రమలకు, గృహాలకు 24గంటల పాటు నిరంతరంగా కరెంట్ సరఫరా చేశారని ఆయన వివరించారు. ప్రజలను మభ్యపెట్టి ఆరు



మాట్లాడుతున్న మజీ మంత్రి కొప్పుల

గ్యారంటీ పథకాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ఆయన మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా సహకార సంఘాల చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, అధికార ప్రతినిధి మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు రాచూరి శ్రీధర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా పురస్కార అవార్డులు ప్రదానం

పెద్దపల్లి కల్చరల్, మార్చి 10: మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగులకు ఆత్మీయంగా తెలంగాణ మున్నూరు కాపు ప్రభుత్వ ఉద్యోగులు మరియు విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మహిళా పురస్కార్ అవార్డులను ప్రదానం చేశారు. దానిలో భాగంగా పెద్దపల్లి జిల్లా నుంచి పీజీ హెచ్ ఎం ఈర్ల శోభారాణి ఉపాధ్యాయురాలు అనాసి జ్యోతి, బండ రజిత, పురుమల్ల అరుణను సత్కరించారు. మున్నూరు కాపు సంఘం పెద్దపల్లి అధ్యక్షుడు తూము రవీందర్, కార్యదర్శి రేగళ్ల రమాకాంత్ హర్షం వ్యక్తం చేశారు.

నేత్రదాత కోరుకంటి మల్లయ్యకు సదాశయ నివాళి

కోల్‌సిటీటౌన్, మార్చి 10: మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ తండ్రి కోరుకంటి మల్లయ్యకు సదాశయ ఫౌండేషన్ నివాళులు అర్పించింది. ఆదివారం గోదావరిఖని తిలక్‌నగర్‌లోని ఫంక్షన్‌హాల్‌లో నేత్రదాత కోరుకంటి మల్లయ్య సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కోరుకంటి మల్లయ్యకు నివాళులు అర్పించి మాజీ ఎమ్మెల్యే చందర్‌ను అభినందిస్తూ అభినందన పత్రాన్ని సింగరేణి జీఎం చింతల శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. సదాశయ ఫౌండేషన్ నాయకులు శ్రవణ్‌కుమార్, లింగమూర్తి, ప్రతినిధులు చంద్రమౌళి, కెఎస్‌వాసు, భీష్మాచారి, రాజమౌళి, దేవీ లక్ష్మీనర్సయ్య, సుధాకర్‌రావు, పాత్రికేయులు ~యానంద్‌గాంధీ, నమ్మిరెడ్డి పాల్గొన్నారు.

ఆత్మరక్షణ కోసం కరాటే

సుల్తానాబాద్, మార్చి 10: ప్రస్తుత సమాజ పరిస్థితులకు అనుగుణంగా తమ పిల్లలకు ప్రాథమిక స్థాయి నుంచే కరాటే నేర్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కరాటే మాస్టర్ బింగరి సతీష్ అన్నారు. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కరాటే శిక్షణ శిబిరాన్ని ఆదివారం మాజీ జడ్పీటీసీ ఐల రమేష్, వాకర్స్ అసోసియోషన్ ప్రతినిదులు ప్రారంభించారు.

బీఆర్ఎస్ హయాంలో సింగరేణి దోపిడీకి గురైంది

- ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 10: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సింగరేణి దోపిడీకి గురైందని, సంస్థ నిధులు విచ్చలవిడిగా మళ్లించబడ్డాయని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సింగరేణిపై ప్రత్యేక దృష్టి సారించినట్టు తెలిపా రు. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టిలు పలుమార్లు సింగరేణి స్థితిగతులపై సమీక్షించినట్టు తెలిపారు. సంస్థలో ఖాళీల భర్తీకి చర్యలు ప్రారంభించినట్టు తెలిపారు. ఇప్పటికే ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్లు జారీ అయ్యాయని అన్నారు. కారుణ్య నియామకాల్లో భాగంగా ఏడాదికి 1000కిపైగా ఉద్యోగాలను భర్తీ చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం దృష్టి సారించినట్టు జనక్‌ప్రసాద్ తెలిపారు. సింగరేణికి కొత్త గనులను కేటాయించాలని కోరుతూ ఇటీవల కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ సెక్రెటరీని కలిసి విజ్ఞప్తి మేరకు తాడిచర్ల-2 బ్లాక్‌ను ఇవ్వడానికి అంగీకరించినట్టు జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. తాడిచర్ల-2 బ్లాక్ 180 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని, 30 ఏళ్ళ పాటు ఉత్పత్తి చేసే అవకాశం ఉన్నట్టు తెలిపారు. ఏడాదికి 5 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయడం ద్వారా సింగరేణికి మణిహారం కానున్నదని జనక్‌ప్రసాద్ తెలిపారు. ఈబ్లాక్ ద్వారా సింగరేణికి 400 కోట్లకు పైగా లాభం వచ్చే అవకాశం ఉన్నదన్నారు. కోయగూడెం-3ని ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టారని దాన్ని అడ్డుకుంటామని అన్నారు. రానున్న నాలుగేళ్లలో వెంకటాపురం, కేకే-6, శ్రావణపల్లి లాంటి కొత్త గనుల


సమావేశంలో మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఐఎన్‌టీయూసీ కృషి చేయనున్నట్టు పేర్కొన్నారు. సంస్థ 100 టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పయనించడంలో యూనియన్ పరంగా అన్ని విధాల సహకారాన్ని అందిస్తామని తెలిపారు. కార్మికుల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని, ఆర్జీ-1లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి త్వరితగతిన పూర్తయ్యేలా ప్రత్యేక దృష్టి సారించినట్టు తెలిపారు. రామగుండం, శ్రీరాంపూర్ ఏరియాల్లో మంచినీటి సరఫరా కోసం రాపిడ్ గ్రావిటీ ప్లాంట్‌ల ఏర్పాటు పనులు వారంలో మొదలు కానున్నట్టు పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో దెబ్బతిన్న సింగ రేణి పూర్వవైభవం తీసుకురావడం, కార్మికుల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ఐఎన్‌టీయూసీ పనిచేస్తుందని జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. సమావేశంలో ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణరెడ్డి, నాయకులు ధర్మపురి, దాస్, శంకర్‌నాయక్, ఎట్టెం కృష్ణ, మార్కండేయ, కొంగర రవీందర్, సత్తయ్య, శ్రీనివాస్, ఆకుల రాజయ్య పాల్గొన్నారు.

యూరియా రవాణాలో ఆర్ఎఫ్‌సీఎల్ రికార్డు

- 11నెలల్లో 350 రైల్వే రేక్‌ల ద్వారా రవాణా


350వ రైల్వే రేక్‌కు జెండా ఊపుతున్న ప్రాజెక్టు సీజీఎం

కోల్‌సిటీ, మార్చి 10: రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్) ఈ ఆర్థిక సంవత్సరంలో యూరియా రవాణాలో సరికొత్త రికార్డు సృష్టించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 10.34లక్షల టన్నుల యూరియాను వివిధ రాష్ట్రాలకు రవాణా చేసింది. ఇందులో రైల్వే రేక్‌ల ద్వారా 95శాతం రవాణా జరిగింది. ఆదివారం 350రైల్వే రేక్‌ను ప్రాజెక్టు సీజీఎం సుధీర్‌కుమార్ ఝా జెండా ఊపి ప్రారంభించారు. ఆ ఆర్థిక సంవత్సరంలో తెలంగాణకు 4,18,805టన్నులు, ఏపీకి 1,44,198టన్నులు, కర్ణాటకకు 1,66,322 టన్నులు, మహారాష్ట్రకు 69860టన్నులు, ఛత్తీస్‌గఢ్‌కు 78,051, తమిళనాడుకు 93,770, మధ్యప్రదేశ్‌కు 63,217టన్నులు రవాణా చేశారు. కార్యక్రమంలో ఆర్ఎఫ్‌సీఎల్‌తో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

కమాన్‌పూర్, మార్చి 10: యువత క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలని కమాన్‌పూర్ ఎస్ఐ మామిడాల చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన నైట్ క్లబ్ క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన క్రీడకారులకు ఆదివారం మండల కేంద్రంలోని ఆదివరాహస్వామి కల్యాణ మండపంలో బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. అనంతరం ప్రథమ విజేతగా నిలిచిన కమాన్‌పూర్ మహాదేవ జట్టుకు రూ.1016ల నగదు, ద్వితీయ బహుమతిని కాటారం జట్టుకు రూ.5016ల నగదును మాజీ ఎంపీపీ ఇనగంటి ప్రేమలత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిన్‌రెడ్డి కిషన్‌రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సాన కృష్ణారెడ్డిలతో కలిసి ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు నారగోని సతీష్‌గౌడ్, మాజీ సర్పంచ్ నీలం సరిత,ఉన్నారు.

కొనుగోలు చేసిన ఇంటిని ఇప్పించండి

పెద్దపల్లిటౌన్, మార్చి 10: పట్టణంలోని శివాలయం పక్కన జలిల్‌కు చెందిన ఇల్లును కొనుగోలు చేశామని తాము కొనుగోలు చేసిన ఇంటిని ఇప్పించాలని చందపల్లికి చెందిన బట్టు కమల అధికారులను వేడుకున్నారు. కమల పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2016లోనే ఇంటిని కొనుగోలు చేసి భర్త బట్టు మల్లయ్య పేరున రిజిస్ట్రేషన్ చేశామన్నారు. అనంతరం భార్య కమల పేరున గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయించాడన్నారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ మ్యుటేషన్ కోసం మున్సిపల్ అధికారికి ఇచ్చినా కాలయాపన చేసినట్లు వాపోయారు. మున్సిపల్ అధికారులతో కలిసి ఓ ప్రజాప్రతినిధి భర్త తాము కొనుగోలు చేసిన ఇంటిని తిరిగి అమ్మిన వ్యక్తిపై అక్రమంగా మ్యుటేషన్ చేయించాడని ఆరోపించారు. స్థానిక ప్రజాప్రతినిధి భర్త బెదిరింపులకు పాల్పడుతున్నాడని విలపించారు. నా భర్త పొలం వద్దకు వెళ్లి వస్తుండగా జరిగిన ఆక్సిడెంట్‌పై అనుమానాలు ఉన్నాయని, అధికారులు స్పందించి విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. కుటుంబ సభ్యులు చందు, అంజి, ఎలువాక శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా మల్లేశం

పెద్దపల్లి రూరల్, మార్చి 10: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన చాట్ల మల్లేశంను తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడిగా రాష్ట్ర అధ్యక్షులు చొప్పరి శంకర్ నియమించారు. ఈ సందర్భంగా ఆదివారం నియామక పత్రాన్ని చాట్ల మల్లేశంకు అందించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ జాతిని ఐక్యం చేస్తూ ముదిరాజ్‌లను చైతన్యం చేసి అభ్యున్నతికి తోడ్పడాలని కోరారు. వారి వెంట హన్మంతునిపేట గ్రామ మాజీ సర్పంచ్ తీగల సదయ్యతో పాటు పలువురు ఉన్నారు.

ఆర్థిక సహాయం

పెద్దపల్లిటౌన్, మార్చి 10: పట్టణంలోని హన్మాన్ నగర్‌లో ధారవేణి రవి గత నెల 21 ఇళ్ళు దగ్ధమై తీవ్రంగా నష్టపోవడంతో ప్రభుత్వ ఐటీఐ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. మంటల్లో రవికి చెందిన నగదుతో పాటు 4 లక్షల 50 వేల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లింది. వాకర్ అసోసియేషన్ తల కొంత పోగు చేసి 25 వేల రూపాయలు రవి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష కార్యదుర్శలు సంపెల్లి వెంకట్‌రెడి, కొమ్ము జగన్, నంది సంపత్‌రెడ్డి, ధరణి సతీష్, కొట్టె లక్ష్మయ్య, ఎలుబాక రమేష్, చింతపండు కొమురయ్య, వెంకటరమణ, మల్లేష్, రాజమౌళి, ధశరథం తదితరులున్నారు.


ఖని కవయిత్రికి అరుదైన గౌరవం

కోల్‌సిటీటౌన్, మార్చి10: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గోదావరిఖనికి చెందిన కవయిత్రి గౌరోజు అనూశ్రీకి అరుదైన గౌరవం దక్కింది. ఆదివారం హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో తెలుగు సాహిత్యానికి సేవలు చేస్తున్నందుకు గాను అనూశ్రీని రాష్ట్రపతి ప్రతినిధి, అడ్మినిస్ట్రేటివ్ విభాగం అధికారి మిలాద్‌మింగ్ ఘనంగా సన్మానించారు. వివిధ భాషల్లో సాహిత్య సేవలు అందిస్తున్న కవులు, కవయిత్రులను సన్మానించగా గోదావరిఖని నుంచి అనూశ్రీ సత్కారం అందుకోవడం పట్ల స్థానిక కవులు, కళాకారులు అభినందనలు తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత

పాలకుర్తి, మార్చి10: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జీడి నగర్ గ్రామానికి చెందిన ఒల్లెపు ప్రభాకర్ అనే వ్యక్తి సెల్‌ఫోన్‌ను ఆదివారం బసంత్‌నగర్ 2వ ఎస్ఐ శివానీరెడ్డి అందజేశారు. జనవరిలో ప్రభాకర్ సెల్‌ఫోన్‌ను అందుగులపల్లె గ్రామంలో పోగొట్టుకోగా బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో సిఇఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను కనిపెట్టి ఆదివారం బాధితుడికి ఎస్ఐ అందజేశారు.

50 ఏళ్ళకు కలిసిన జడ్పీ హైస్కూల్ విద్యార్థులు


సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పాటు పూర్వవిద్యార్థులు

కోల్‌సిటీటౌన్, మార్చి 10: ఒకే చోట కలిసి చదువుకొని పై చదువుల కోసం వెళ్ళిపోయిన వారు... గడిచిన ఐదు దశాబ్ధాల జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు ఆదివారం గోదావరిఖనిలోని రెడ్డి భవన్‌లో జరిగిన అపూర్వ స్వర్ణోత్సవ సమ్మేళనం వేదికగా. వారే గోదావరిఖనిలోని నెహ్రూ మెమోరియల్ జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1970-72 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు. చదువుకున్న జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఉల్లాసంగా...ఉత్సాహంగా పాటలు పాడారు..డ్యాన్సులు చేశారు. చదువు చెప్పిన ఉపాధ్యాయులు కె రామసుధాకర్‌రాజు, రామకృష్ణారావు పేరయ్య హేమలతను పూర్వవిద్యార్థులు సన్మానించారు. డాక్టర్ నవీన్, ఎన్ రాములు, విజయ్‌కు మార్, నారపురెడ్డి, రామకృష్ణ, జగన్‌మోహన్‌రెడ్డి, నాగేంద్రగుప్తా, సంగీత పాల్గొన్నారు.

● సంక్షిప్త సమాచారం..

రామగిరి: మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన రోడ్డలక్ష్మి కుటుంబానికి ఐటిశాఖమంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు రూ.2.5లక్షల ఎల్‌వోసీని మంజూరు చేయగా ఆదివారం రొడ్డ లక్ష్మికి అందజేశారు.

మంథని: స్థానిక శ్రీసీలేశ్వర-సిద్దేశ్వరాలయంలో లోకే రాధాకిషన్‌రావు కుటుంబ సభ్యులు భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు.

ధర్మారం: మండల కేంద్రంలోగల సీతారామచంద్రస్వామి ఆలయంలో పుష్కర బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం రాత్రి విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, ప్రత్యేకపూజలు నిర్వహించారు.